
10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/19/2026 6:25 AM Page 1

మన రాజధాని
# రక్షణ
నిజం మా బలం
బాపట్ల | గుంటూరు | పల్నాడు
బుధవారం 19 ఆగస్టు 2026 పేజీలు : 4

## హత్యకుట్రను పక్కదారి పట్టించే వీడియోనా?


◆నరేంద్రరెడ్డి సెల్ఫీ వీడియోపై కొత్త అనుమానాలు

◆కేశవ్ పేరు ఎందుకు?.. ఐఏఎస్ పులి శ్రీనివాస్‌ను ఎందుకు లాగారు?


5లో.

బోనబోయిన శ్రీనివాస యాదవ్ హత్యకు రూ.కోటిన్నర సుపారీ ఆరోపణల నేపథ్యంలో వైసీపీ నేత నరేంద్రరెడ్డికి సంబంధించినదిగా వైరల్ అవుతున్న వీడియో ఇప్పుడు గుంటూరు రాజకీయాల్లో ప్రకంపనలు రేపుతోంది. హత్యకుట్రను పక్కదారి పట్టించే ప్రయత్నంలో భాగంగానే వీడియో విడుదలైందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ మొత్తం వ్యవహారాన్ని కూటమి ప్రభుత్వం సీరియస్‌గా పరిగణిస్తున్నట్లు, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పోలీసు అధికారులను అప్రమత్తం చేసి సమగ్ర దర్యాప్తునకు ఆదేశించినట్లు సమాచారం. వైరల్ వీడియో వెనుక ఉన్నవారెవరు? హత్యకుట్ర ఆరోపణలకు, నరేంద్రరెడ్డి వ్యవహారాలకు ఉన్న సంబంధమేంటి? అన్నదానిపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నట్లు తెలుస్తోంది.

గుంటూరు రక్షణ క్రైమ్ స్పెషల్




# లెక్క తేలాల్సిందే!

ఎడిటర్ నరేంద్ర



బాపట్ల: ప్రజల సమస్యలపై ప్రశ్నించే జర్నలిస్టులే తమ సమస్యలపై ప్రశ్నించుకోలేని పరిస్థితి ఉండకూడదు. బాపట్లలో జర్నలిస్టుల మధ్య కొనసాగుతున్న విభేదాలు, వేర్వేరు సంఘాలుగా విడిపోవడం, సంక్షేమం కోసం దాతలు అందించిన నిధులపై స్పష్టత లేకపోవడంపై ఇప్పుడు జర్నలిస్టు వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యంగా ఆపదలో ఉన్న జర్నలిస్టుకు అండగా నిలవాల్సిన నిధులు ఉంటే.. వాటి వివరాలు సభ్యుల ముందుంచి, వాటి వినియోగంపై స్పష్టమైన నిర్ణయం తీసుకోవాల్సిన సమయం వచ్చిందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**జర్నలిస్టుల కోసం వచ్చిన నిధులు.. జర్నలిస్టులకే ఉపయోగపడాలి**

- ▸సంఘాలు వేరైనా..
- ▸సంక్షేమం విషయంలో ఒక్కటవ్వాలి
- ▸నిధులపై స్పష్టత వస్తేనే

వివరాలు 2లో..


వి వ రా లు 4లో..

## మున్సిపల్ పోరుకు లైన్ క్లియర్!

విలీన పంచాయతీల పిటిషన్ల ఉపసంహరణకు అడుగు

33 వార్డుల నుంచి 40కి పైగా పెరిగే అవకాశం

కొత్త గ్రామాలతో మారనున్న బాపట్ల రాజకీయ సమీకరణాలు

బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో

బాపట్ల మున్సిపల్ ఎన్నికలపై నెలకొన్న ఉత్కంఠ క్రమంగా తొలగుతోంది. మున్సిపాలిటీలో పంచాయతీల విలీనానికి సంబం ధించిన న్యాయ వివా దాల పరిష్కారానికి అడుగులు పడుతున్నాయి. గతంలో విలీనాన్ని వ్యతిరే కి స్తూ హైకోర్టును ఆశ్రయించిన స్థానికులు పిటిషన్ల ఉపసంహరణకు ముం దుకు రావడంతో ఎన్నికలకు మార్గం సుగమమయ్యే అవకాశాలు కనిపిస్తు న్నాయి. వార్డుల సంఖ్య కూడా పెరగనుండటంతో ఈసారి పోరు ఆసక్తికర ంగా మారనుంది.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/19/2026 6:25 AM Page 2



# ఎన్నికల విధుల్లో అధికారులు బాధ్యతగా పనిచేయాలి

## చీరాలలో పెండింగ్ హియరింగ్స్ త్వరగా పూర్తి చేయాలనీ కలెక్టర్ ఆదేశం



బాపట్ల రక్షణ న్యూస్

ఎన్నికల విధులను అధికారులు చిత్తశుద్ధి, బాధ్యతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వి. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీక్షణ సమావేశ మందిరంలో ఎన్నికలు, ప్రజా సమస్యల పరిష్కారం, 22ఎ, భూసేకరణ, వాట్సాప్ గవర్నెన్స్ తదితర అంశాలపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు.సంక్లిష్ట ఓటరు సవరణ జాబితాకు సంబంధించి నోటీసులు, హియరింగ్స్‌లో చీరాలలో పెండింగ్ అధికంగా ఉందని కలెక్టర్ తెలిపారు. ఈఆర్‌ఓ, ఏఈఆర్‌ఓ స్థాయిలో హియరింగ్స్ నిర్వహించి, చిన్నపాటి తప్పులను బీఎల్‌ఓ స్థాయిలోనే పరిష్కరించాలని సూచించారు. దరఖాస్తుదారుల నుంచి అందుబాటులో ఉన్న పత్రాలను అప్‌లోడ్ చేయడంతో పాటు హియరింగ్ ఫొటోలను కూడా అప్‌లోడ్ చేయాలన్నారు. పెండింగ్ హియరింగ్స్‌కు ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని ఆదేశించారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్స్ అందుబాటులో ఉండాలని, తనిఖీల సమయంలో అవి కనిపించకపోతే సంబంధిత బీఎల్‌ఓపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ప్రజా సమస్యల పరిష్కారానికి వచ్చే దరఖాస్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. దరఖాస్తుదారులతో మర్యాదగా వ్యవహరించి, ప్రతి దరఖాస్తుకు తేదీతో కూడిన ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఫిర్యాదులను నాణ్యతతో పరిష్కరించే అధికారులకు అవార్డులు అందిస్తామని తెలిపారు. 22ఎ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలని, వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా అందుతున్న ప్రభుత్వ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు.రీ-సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్‌పుస్తకాల్లో ఇతరములు లేకుండా చూడాలని, ప్రభుత్వ కార్యాలయాలు, రైతుబజార్ల ఏర్పాటుకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని కలెక్టర్ ఆదేశించారు.సమావేశంలో ఇన్‌చార్జి జిల్లా రెవెన్యూ అధికారి లవన్న, ఆర్డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు,వీఆర్వోలు,ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.

## 36 వసతి, విద్యా సంస్థల్లో 'మార్పు' పనులు

### పనుల నాణ్యతలో రాజీ వద్దు: కలెక్టర్ సాయికాంత్ వర్మ



**గుంటూరు, (రక్షణ న్యూస్):** జిల్లాలోని 36 వసతి, విద్యా సంస్థల్లో చేపడుతున్న 'మార్పు' కార్యక్రమ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఎంపిక చేసిన సంస్థల్లో సుందరీకరణతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం, కనీస వసతులు పూర్తిస్థాయిలో కల్పించాలని సూచించారు. పది మందికి ఒక మరుగుదొడ్డి చొప్పున ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్, సౌర విద్యుత్ ఏర్పాట్లు, వ్యర్థాల నిర్వహణ వంటి అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ, బీసీ, గిరిజన, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులు, ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఆర్‌అండ్‌బీ, నెడ్‌క్యాప్ అధికారులు పాల్గొన్నారు.

# లెక్క తేలాల్సిందే!

మొదటి పేజీ తరువాయి

## ఎడిటర్ నరేంద్ర....

జర్నలిస్టు అంటే రోజూ ప్రజల కోసం తిరిగే వ్యక్తి. రోడ్డు పాడైతే రాస్తాడు.. ప్రభుత్వ ఆసుపత్రిలో సమస్య ఉంటే అధికారుల దృష్టికి తీసుకెళ్తాడు.. పేదవాడికి అన్యాయం జరిగితే ప్రశ్నిస్తాడు.. ప్రజాప్రతినిధి ఇచ్చిన హామీ అమలు కాకపోతే గుర్తు చేస్తాడు. ఉదయం నుంచి రాత్రి వరకు సమాజం కోసం పనిచేసే ఈ వృత్తిలో ఉన్న వ్యక్తికి ఆపద వస్తే మాత్రం అతని వెనుక నిలిచే బలమైన వ్యవస్థ ఉండాలి. అదే జర్నలిస్టు సంక్షేమ సంఘం అసలు ఉద్దేశం.బాపట్లలో జర్నలిస్టుల సంక్షేమం కోసం గతంలో ఏర్పాటైన బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్‌కు అప్పటి వ్యాపారవేత్త, ప్రస్తుత ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ రూ.5 లక్షలు అందించినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు. ఆ మొత్తాన్ని అప్పటి అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు సమాచారం. వడ్డీతో ఆ మొత్తం సుమారు రూ.7 లక్షలకు చేరినట్లు చెబుతున్నారు.ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. ఆ డబ్బు ఇప్పుడు ఎక్కడ ఉంది? ఎంత ఉంది? ఎవరి ఆధీనంలో ఉంది? ఎంత వడ్డీ వచ్చింది? ఇప్పటివరకు ఏ జర్నలిస్టుకు ఎంత సహాయం చేశారు? అన్న వివరాలు సభ్యులకు తెలియాల్సిన అవసరం ఉంది.ఇది ఎవరినైనా నిందించేందుకు అడిగే ప్రశ్న కాదు. ఒక సంఘానికి సంబంధించిన నిధులపై సభ్యులు వివరాలు తెలుసుకోవడం సహజం. అంతేకాదు.. నిధులు సక్రమంగా ఉంటే వాటి వివరాలు బయటపెట్టడం వల్ల సంఘంపై నమ్మకం మరింత పెరుగుతుంది. అనుమానాలకు కూడా తావుండదు.ఇదే విధంగా జర్నలిస్టుల కోసం కార్యాలయం ఏర్పాటు చేయాలనే ఉద్దేశంతో అప్పటి ఎమ్మెల్యే కోన రఘుపతి రూ.5 లక్షలు అందించినట్లు సమాచారం. ఇతర ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు కూడా విరాళాలు ప్రకటించినట్లు జర్నలిస్టులు చెబుతున్నారు. ఈ మొత్తాల పరిస్థితి ఏమిటన్నది కూడా తేలాల్సి ఉంది. ఎంత వచ్చింది? ఎంత ఖర్చయింది? ప్రస్తుతం ఎంత మిగిలింది? కార్యాలయ నిర్మాణానికి ఎంత ఉపయోగించారు? అన్నది స్పష్టంగా ఉండాలి.ప్రజల డబ్బుకు ప్రభుత్వం లెక్క చెప్పాలని మనమే వార్తలు రాస్తాం. ఒక పథకానికి నిధులు వస్తే వాటి వినియోగం ఏమిటని ప్రశ్నిస్తాం. ఒక రహదారి కోసం నిధులు మంజూరైతే పనులు జరిగాయా? అని అడుగుతాం. మరి జర్నలిస్టుల సంక్షేమం కోసం వచ్చిన నిధుల విషయంలో కూడా అదే పారదర్శకత ఉండాలి కదా? ఇదే సాధారణ జర్నలిస్టు అడుగుతున్న ప్రశ్న.ఇటీవల బాపట్లలో ముగ్గురు జర్నలిస్టులు రోడ్డు ప్రమాదాలకు గురికావడం, వారిలో ఇద్దరు ప్రాణాలు కోల్పోవడం, మరొకరు తీవ్ర ఇబ్బందుల్లో ఉండటం పరిస్థితి తీవ్రతను గుర్తుచేస్తోంది. ఇలాంటి సమయంలో సంక్షేమ నిధి ప్రాధాన్యం తెలుస్తుంది. ఒక జర్నలిస్టు ఆసుపత్రిలో చేరినప్పుడు అతని కుటుంబం డబ్బు కోసం తిరగకుండా సంఘం అండగా నిలవాలి. ఒక జర్నలిస్టు అకాల మరణం చెందితే అతని కుటుంబానికి తక్షణ సహాయం అందాలి.

**అదే సంక్షేమ నిధి లక్ష్యం కాదా?...** ప్రస్తుతం పరిస్థితి మాత్రం మరోలా కనిపిస్తోంది. ప్రమాదం జరిగినప్పుడు సహచర జర్నలిస్టులు తమ జేబుల్లోంచి డబ్బులు వేసుకుని సాయం చేస్తున్నారు. అది అభినందించాల్సిన మానవత్వం. కానీ జర్నలిస్టుల కోసం ప్రత్యేకంగా నిధులు ఉంటే.. ఆ నిధులు ఎప్పుడు ఉపయోగపడాలి? అనే ప్రశ్నకు సమాధానం రావాలి.

సంఘాలు రెండు ఉండొచ్చు. నాయకత్వాలు వేరుగా ఉండొచ్చు. అభిప్రాయాలు భిన్నంగా ఉండొచ్చు. కానీ ఒక జర్నలిస్టుకు కష్టం వచ్చినప్పుడు మాత్రం అందరూ ఒక్కటే కావాలి.

ఒక జర్నలిస్టు ఆసుపత్రిలో ఉన్నప్పుడు "అతను ఏ సంఘానికి చెందినవాడు?" అని అడిగితే.. మనం నిర్మించుకున్న సంఘాల ప్రయోజనం ఏమిటి? ఒక జర్నలిస్టు చనిపోయినప్పుడు "అతను మన వర్గం కాదు" అని పక్కకు తప్పుకుంటే.. జర్నలిస్టు ఐక్యతకు అర్థం ఏమిటి?

**కష్టం ముందు సంఘం కాదు.. సహచరుడే ముఖ్యం....** ఒక చిన్న ఉదాహరణ చెప్పాలంటే.. ఒక ఇంటికి మంటలు అంటుకున్నప్పుడు పక్కింటివాడు ముందుగా నీళ్లు తీసుకొస్తాడు. ఆ ఇల్లు ఎవరిది? ఏ కులం? ఏ వర్గం? అని ఆలోచించడు. ఎందుకంటే ఆ సమయంలో ఆపద ముఖ్యం. అదే విధంగా జర్నలిస్టు ఆపదలో ఉన్నప్పుడు కూడా అతని వెనుక అందరూ నిలబడాలి.జర్నలిస్టు సమాజంలో కులాలు, వర్గాలు, వ్యక్తిగత విభేదాలు పెరిగితే చివరకు నష్టపోయేది వ్యక్తులు కాదు.. మొత్తం వృత్తి. ప్రజల కోసం రాసే కలం తనలో తాను విడిపోతే ఆ కలం బలం తగ్గిపోతుంది.అందుకే ఇప్పటికైనా రెండు వర్గాల ప్రతినిధులు ఒకే చోట కూర్చోవాలి. గతంలో ఎవరు తప్పు చేశారు? ఎవరి వల్ల విభేదాలు వచ్చాయి? అనే విషయాలను కొంతసేపు పక్కన పెట్టాలి. ఇప్పుడు ఉన్న నిధులు ఎంత? ఎక్కడ ఉన్నాయి? ఎలా పెరిగాయి? ఎంత ఖర్చయ్యాయి? అన్నదే ముందుగా తేల్చాలి.అవసరమైతే ఇరు వర్గాల నుంచి సమాన సంఖ్యలో సభ్యులతో సంయుక్త కమిటీ ఏర్పాటు చేయాలి. బ్యాంకు ఖాతాలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, విరాళాలు, ఖర్చుల వివరాలు పరిశీలించి సభ్యుల ముందుంచాలి. భవిష్యత్తులో ప్రతి ఏడాది ఆదాయ, వ్యయ వివరాలను వెల్లడించే విధానం తీసుకురావాలి.

లెక్కలు సక్రమంగా ఉంటే అనుమానాలు పోతాయి.

లెక్కలు బయటపెడితే నమ్మకం పెరుగుతుంది.

నిధులు ఉంటే.. ఆపదలో ఉన్న జర్నలిస్టుకు అండగా నిలవాలి.

అధ్యక్షుడు ఎవరు? కార్యదర్శి ఎవరు? ఏ సంఘం పెద్దది? అనే పోటీ కన్నా..

ఒక జర్నలిస్టు కష్టంలో ఉన్నప్పుడు ముందుగా ఎవరు నిలబడతారన్నదే అసలు పోటీ కావాలి.ఇది ఎవరి మీదో ఆరోపణ కాదు. మొత్తం జర్నలిస్టు సమాజం ఆలోచించాల్సిన అంశం. ఈరోజు మనం ఆరోగ్యంగా ఉన్నాం. రేపు మనకు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియదు. అందుకే మనం ఏర్పాటుచేసే సంక్షేమ వ్యవస్థ మన తర్వాత వచ్చే జర్నలిస్టులకు కూడా ఉపయోగపడాలి.నాయకత్వాలు మారుతాయి.. సంఘాలు మారుతాయి.. కానీ జర్నలిస్టుల సంక్షేమం మాత్రం మారకూడదు.ప్రజలకు ఐక్యత గురించి చెప్పే జర్నలిస్టులు ముందుగా తమలో ఐక్యత చూపించాలి. కులం కాదు.. వర్గం కాదు.. సంఘం కాదు.. జర్నలిస్టు అనే గుర్తింపే మొదటిది కావాలి.ఇకనైనా వ్యక్తిగత విభేదాలకు స్వస్తి చెప్పి, నిధులపై పూర్తి లెక్కలు తేల్చి, భవిష్యత్తులో ఏ జర్నలిస్టుకైనా ఆపద వస్తే వెంటనే అండగా నిలిచే విధానాన్ని రూపొందించాలి.

జర్నలిస్టుల కోసం వచ్చిన ప్రతి రూపాయికీ లెక్క ఉండాలి.

జర్నలిస్టు కష్టంలో ఉన్నప్పుడు ఆ నిధి ఉపయోగపడాలి.

జర్నలిస్టుల మధ్య చీలికలు కాదు.. ఐక్యత కనిపించాలి.

లెక్క తేలాల్సిందే.. ఐక్యత నిలవాల్సిందే!....

**మాజీ అధ్యక్షుడు వేజెండ్ల మాటల్లో....** బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేజెండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే నరేంద్రవర్మ అందించిన రూ.5 లక్షలను యాక్సిస్ బ్యాంకులో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు రూ.2.30 లక్షల వడ్డీ వచ్చినట్లు చెప్పారు. నిధులు జర్నలిస్టుల సంక్షేమానికి వినియోగించకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుత కార్యవర్గానికి నిధులు అప్పగించేందుకు సిద్ధంగా ఉన్నామని, వారు స్వీకరించకపోవడంతోనే నిలిచిపోయాయని తెలిపారు. ఇటీవల ప్రమాదాలకు గురైన జర్నలిస్టులకు ఈ నిధులు ఉపయోగించి ఉంటే బాగుండేదన్నారు.

**అధ్యక్షుడు ధనరాజ్ మాటల్లో...** బాపట్ల జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ధనరాజ్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ ఇచ్చిన రూ.5 లక్షల నిధులపై గతంలో పలుమార్లు చర్చలు జరిగినా ఫలించలేదన్నారు. ప్రస్తుతం నిధులు ఇస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నామని, వేజెండ్ల శ్రీనివాసరావుతో మాట్లాడతానన్నారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి ఇచ్చిన రూ.5 లక్షల్లో కొంత మొత్తం జర్నలిస్టుల సంక్షేమానికి ఖర్చు చేశామని, సుమారు రూ.4 లక్షలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామన్నారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/19/2026 6:25 AM Page 3



# నేతాజీ పోరాటం యువతకి స్ఫూర్తిదాయకం

**బాపట్ల రక్షణ న్యూస్**




భరతమాత ముద్దుబిడ్డ, స్వతంత్ర భారత సాధన కోసం సాయుధ పోరాటానికి నాయకత్వం వహించిన ధీశాలి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల ప్రతినిధులు కొనియాడారు. నేతాజీ 81వ వర్ధంతి సందర్భంగా మంగళవారం మండల కార్యాలయం వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1943లో సింగపూర్‌లో స్వతంత్ర భారత ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి, భారత జాతీయ సైన్యాన్ని నిర్మించిన ఘనత నేతాజీ సుభాష్ చంద్రబోస్‌కు దక్కుతుందన్నారు. దేశ విదేశాల మద్దతు కూడగట్టి బ్రిటిష్ పాలన నుంచి భారతదేశ విముక్తి కోసం ఆయన అహర్నిశలు పోరాడారని పేర్కొన్నారు. బ్రిటిష్ వారి కళ్లుగప్పి ప్రపంచంలోని పలు దేశాల్లో పర్యటించి భారత స్వాతంత్ర్య ఉద్యమానికి మద్దతు కూడగట్టారని తెలిపారు. మొత్తం 11 సార్లు జైలు శిక్ష అనుభవించిన నేతాజీ జాతికి 'జైహింద్' నినాదాన్ని అందించారని గుర్తుచేశారు.కార్యక్రమంలో ఫోరం కార్యదర్శి డాక్టర్ పి.సి. సాయిబాబు, సబ్ ట్రెజరీ అధికారి ఏ. పరిశుద్ధరావు, న్యాయవాది టి. భాస్కరరావు, నర్రా సాంబు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# 22-ఏ భూములపై సమీక్ష

**బాపట్ల రక్షణ న్యూస్**




22-ఏ కేసులు, 1954కు ముందు ఉన్న నిషేధిత జాబితా భూములకు సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని న్యూ వీసీ హాల్‌లో డీఎల్ఎస్‌సీ సమావేశం నిర్వహించి భూములకు సంబంధించిన 14 అంశాలను పరిశీలించారు.వాటిలో నాలుగు అంశాలకు ఆమోదం తెలపగా, ఏడు అంశాలను తిరస్కరించారు. మరో మూడు అంశాలపై అదనపు నివేదికలు సమర్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. భూముల వివరాలు, సంబంధిత రికార్డులను సమగ్రంగా పరిశీలించి నిబంధనల మేరకు నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు.సమావేశంలో జేసీ భావన, డీఆర్వో లవన్న, ఏడీ సర్వేయర్ శేషగిరి, జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు, చీరాల ఆర్డీవో నరసింహారావు, బాపట్ల ఆర్డీవో హరికుమార్, ల్యాండ్ సెక్షన్ సూపరింటెండెంట్ సతీష్, చిన్నగంజాం, చీరాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

# బాలికల భద్రత శక్తి బృందం అవగాహన కార్యక్రమం




**చీరాల రక్షణ న్యూస్**

చీరాల భావ్యం స్కూల్ విద్యార్థినులకు 'శక్తి యాప్', 'సెల్ఫ్ డిఫెన్స్'పై చీరాల సబ్‌డివిజన్ శక్తి బృందం అవగాహన కల్పించింది. బాపట్ల జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ ఆదేశాల మేరకు, చీరాల డీఎస్పీ ఎం.డి. మోయిన్, వన్‌టౌన్ సీఐ సోమశేఖర్ సూచనలతో వన్‌టౌన్ ఎస్సై శ్రీనివాసరావు, శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా మహిళలు, బాలికల భద్రత కోసం పోలీస్ శాఖ అందిస్తున్న సేవలను విద్యార్థినులకు వివరించారు. అత్యవసర పరిస్థితుల్లో 'శక్తి యాప్'లోని ూూ సదుపాయాన్ని వినియోగించుకోవడం, 112 అత్యవసర నంబర్‌కు ఫోన్ చేసి పోలీసులను సంప్రదించే విధానంపై అవగాహన కల్పించారు. బస్టాప్‌లు, పాఠశాల పరిసరాలు, ప్రజా ప్రదేశాలు, సామాజిక మాధ్యమాల్లో జరిగే ఈవ్‌టీజింగ్, అసభ్యకర వ్యాఖ్యలు, వెంటపడటం, బెదిరింపులు వంటి వేధింపులను సహించకూడదని సూచించారు.ఎస్సై శ్రీనివాసరావు మాట్లాడుతూ వేధింపులు ఎదురైనప్పుడు విద్యార్థినులు భయపడకుండా వెంటనే శక్తి యాప్ ూూ లేదా 112 ద్వారా పోలీసులను సంప్రదించాలని సూచించారు. మహిళల భద్రతకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని తెలిపారు. విద్యార్థినులు చదువుతో పాటు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ, సమయపాలన, ఆత్మరక్షణ నైపుణ్యాలనుపెంపొందించుకోవాలనిసూచించారు.ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, హెచ్ఎం శిరీష మాట్లాడుతూ విద్యార్థినులపై జరిగే వేధింపులు వారి విద్యాభ్యాసం, మానసిక ప్రశాంతత, ఆత్మవిశ్వాసంపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నారు. సురక్షితమైన విద్యా వాతావరణం కోసం విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు, హెచ్ఎం శిరీష, ఇతర ఉపాధ్యాయులు, శక్తి టీం కానిస్టేబుల్ సుబ్బారావు, విద్యార్థినులు

# సుభాష్ చంద్రబోస్ సేవలు చిరస్మరణీయం



**కర్లపాలెం రక్షణ న్యూస్**

సాయుధ పోరాటం ద్వారా భారత జాతిని మేలుకొలిపిన గొప్ప పోరాటయోధుడు సుభాష్ చంద్రబోస్ అని కర్లపాలెం మోడల్ ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి. శ్రీనివాసరావు అన్నారు. సుభాష్ చంద్రబోస్ వర్ధంతి సందర్భంగా స్థానిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ఇనకొల్లు పోలీసురావు మాట్లాడుతూ దేశ యువతను స్వాతంత్ర్య ఉద్యమం వైపు జాగృతం చేసిన నిత్యస్ఫూర్తి సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు. అనంతరం బోస్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. విద్యార్థులకు మిఠాయిలు పంపిణీ చేశారు.కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు కె. విమలమ్మ, బుర్ల రాజేష్, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఓటర్ల జాబితాపై కసరత్తు

**రెంటచింతల రక్షణ న్యూస్**



రానున్న రోజుల్లో జరగనున్న పంచాయతీ ఎన్నికలకు సంబంధించి ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల గుర్తింపు, ఓటర్ల జాబితాలో మార్కింగ్ ప్రక్రియను ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం చేపడుతున్నట్లు గురజాల డివిజన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ డి. గబ్రూనాయక్ తెలిపారు.మంగళవారం రెంటచింతల పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ప్రచురించిన ఓటర్ల జాబితాలను ఆధారంగా చేసుకుని ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్లను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ఈ నెల 22 వరకు ఇంటింటి సర్వే నిర్వహిస్తామని తెలిపారు. 25న గుర్తించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓటర్ల ముసాయిదా జాబితాను ప్రచురించి, 26 నుంచి 28 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తామన్నారు. సెప్టెంబర్ 7న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని వెల్లడించారు.ఓటర్లు తమ పేర్లు, కుల వర్గానికి సంబంధించిన వివరాలను పరిశీలించుకుని నిర్ణీత గడువులోగా అభ్యంతరాలు, దరఖాస్తులు అందజేయాలని గబ్రూనాయక్ సూచించారు. సమావేశంలో కార్యదర్శి జి. కోటేశ్వరరావు, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

# రైలుపేటలో నేడు విద్యుత్ నిలిపివేత

**బాపట్ల రక్షణ న్యూస్**



బాపట్ల పట్టణం నందు విద్యుత్ మరమ్మతులు, RDSS పథకం కింద కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు పనుల నేపథ్యంలో రైలుపేటలోని రెల్లి కాలనీలో బుధవారం విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు బాపట్ల టౌన్ విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్ తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మార్పిడి, అభివృద్ధి పనులు చేపడుతున్నందున వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు. అత్యవసర పనులను దృష్టిలో ఉంచుకుని ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/19/2026 6:25 AM Page 4



# మున్సిపల్ పోరుకు లైన్ క్లియర్!

**మొదటి పేజీ తరువాయి**

**బాపట్ల జిల్లా రక్షణ బ్యూరో**

బాపట్ల: స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న వేళ.. బాపట్ల మున్సిపల్ ఎన్నికలు జరుగుతాయా? లేదా? అన్న సందేహానికి క్రమంగా తెరపడుతోంది. ఎన్నికల నిర్వహణకు అడ్డుగా ఉన్న న్యాయపరమైన అంశాలను పరిష్కరించేందుకు ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ దృష్టి సారించినట్లు సమాచారం. గత రెండు రోజులుగా విలీన పంచాయతీలు, కోర్టు వ్యవహారాలు, ఎన్నికల ప్రక్రియకు ఎదురయ్యే న్యాయపరమైన చిక్కులపై వివరాలు సేకరించినట్లు తెలుస్తోంది.

2021లో మొదలైన విలీనం...బాపట్ల మున్సిపాలిటీ పరిధిని విస్తరించేందుకు 2019 డిసెంబరు 31న జారీ చేసిన జీఓ ఎంఎస్ నం.224 ద్వారా ఎనిమిది గ్రామ పంచాయతీలు/గ్రామాలను మున్సిపాలిటీలో విలీనం చేసే ప్రక్రియకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సంబంధిత పంచాయతీలను డీనోటిఫై చేసి బాపట్ల మున్సిపాలిటీలో చేర్చే నిర్ణయం తీసుకున్నారు. విలీన ప్రక్రియలో వెస్ట్ బాపట్ల, అడవి, దరివాద-కొత్తపాలెం, ఆదర్శనగర్, హనుమంతనగర్, రామనగర్, సూర్యలంక తదితర ప్రాంతాలు కోర్టు వివాదాల్లో ప్రస్తావనకు వచ్చాయి. 2020లో హైకోర్టులో దాఖలైన పిటిషన్లలో వెస్ట్ బాపట్లతో పాటు దరివాదకొత్తపాలెం, కుక్కలవారిపాలెం, మహాత్మాజీపురం, వైఎస్సార్ నగర్, సుబ్బారెడ్డిపాలెం, నాగేంద్రపాలెం ప్రాంతాల విలీనాన్ని సవాలు చేసినట్లు కోర్టు రికార్డుల్లో ఉంది. అలాగే అడవి పంచాయతీకి చెందిన ఆదర్శనగర్, హనుమంతనగర్, రామనగర్, సూర్యలంక విలీనంపైనా పిటిషన్ దాఖలైంది.

పిటిషనర్లు ఎవరు?...బాపట్ల విలీన అంశానికి సంబంధించి 2021లో హైకోర్టు విచారణకు వచ్చిన కేసుల్లో వల్లూ నాగ శ్రీను, కె.జి. శ్రీనివాసరావు, కావూరి శ్రీనివాసరెడ్డి పేర్లు ఉన్నాయి. కోర్టు రికార్డుల ప్రకారం వాలు నాగ శ్రీను పిన్నవల్లూరివారిపాలెం ప్రాంతానికి చెందినవారు కాగా, కె.జి. శ్రీనివాసరావు అడవి రామనగర్‌కు చెందినవారు. కావూరి శ్రీనివాసరెడ్డి దరివాదకొత్తపాలెం ప్రాంతానికి చెందినవారిగా నమోదయ్యారు. అయితే బాపట్ల విలీన ప్రక్రియకు సంబంధించి ఒకటి కంటే ఎక్కువ పిటిషన్లు నమోదైనట్లు హైకోర్టు రికార్డులు చూపిస్తున్నాయి. అందువల్ల మొత్తం న్యాయ వివాదాన్ని కేవలం ముగ్గురి పిటిషన్లకే పరిమితం చేయకుండా.. సంబంధిత కేసుల స్థితిని పరిశీలించాల్సి ఉంటుంది.

నిధుల భయంతోనే అభ్యంతరాలు...పంచాయతీలుగా కొనసాగితే తమ ప్రాంతాలకు వస్తున్న పంచాయతీ నిధులు, అభివృద్ధి పనులు కొనసాగుతాయని.. మున్సిపాలిటీలో విలీనం చేస్తే ఆ నిధుల పరిస్థితి ఏమవుతుందనే సందేహాలతో కొందరు స్థానికులు కోర్టును ఆశ్రయించినట్లు అప్పట్లో వాదనలు వచ్చాయి. విలీనం వల్ల గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి ప్రభావితమవుతుందన్న ఆందోళన కూడా వ్యక్తమైంది.ఈ న్యాయ వివాదాల కారణంగా విలీన ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో మున్సిపల్ ఎన్నికలపైనా ప్రభావం పడింది. ఇదే సమయంలో స్థానిక సంస్థల పరిధిలో అందాల్సిన నిధులు, అభివృద్ధి కార్యక్రమాలపైనా అనిశ్చితి నెలకొంది.

ఇప్పుడు ఎందుకు కదలిక?...కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సిద్ధమవుతున్న నేపథ్యంలో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న న్యాయపరమైన సమస్యలను ముందుగా పరిష్కరించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో బాపట్లలోనూ విలీన పంచాయతీలకు సంబంధించిన కేసులపై దృష్టి సారించినట్లు తెలుస్తోంది.కేసులు వేసిన పిటిషనర్లు వాటిని ఉపసంహరించుకునేందుకు ముందుకు రావడంతో బాపట్ల మున్సిపల్ ఎన్నికలకు ఉన్న ప్రధాన అడ్డంకుల్లో ఒకటి తొలగే అవకాశం కనిపిస్తోంది. అయితే పిటిషన్ ఉపసంహరణ ఒక్కటే ఎన్నికలు ఖరారైనట్లు కాదు. వార్డుల పునర్విభజన, రిజర్వేషన్లు, ఓటర్ల జాబితా, మున్సిపల్ పరిధి తుది నిర్ణయం, రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ వంటి దశలు పూర్తికావాల్సి ఉంటుంది.

33 నుంచి 40కి పైగా..ప్రస్తుతం బాపట్ల మున్సిపాలిటీలో 33 వార్డులు ఉన్నాయి. విలీన ప్రాంతాలను పరిగణనలోకి తీసుకుని వార్డుల పునర్విభజన జరిగితే సంఖ్య 40కి పైగా పెరిగే అవకాశం ఉందన్న చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. అయితే తుది సంఖ్య అధికారిక పునర్విభజన తర్వాతే స్పష్టమవుతుంది.

వార్డుల సంఖ్య పెరగడం కేవలం పరిపాలనా మార్పు మాత్రమే కాదు.. రాజకీయ సమీకరణాలపైనా ప్రభావం చూపనుంది. ఇప్పటివరకు మున్సిపల్ పరిధిలో లేని ప్రాంతాలు కొత్తగా ఓటర్లుగా చేరితే ప్రతి వార్డులోనూ కొత్త లెక్కలు మొదలవుతాయి.

విలీన గ్రామాలతో కొత్త లెక్కలు...విలీన ప్రాంతాల్లో గతంలో వేర్వేరు రాజకీయ పార్టీలకు అనుకూలంగా ఉన్న ప్రాంతాలు ఉన్నాయి. కొన్ని చోట్ల టీడీపీకి బలం ఉండగా.. మరికొన్ని ప్రాంతాల్లో వైసీపీకి అనుకూల పరిస్థితులు ఉన్నట్లు స్థానిక రాజకీయ వర్గాల్లో చర్చ ఉంది. దీంతో కొత్తగా చేరే గ్రామాలు ఏ పార్టీకి ఎన్ని ఓట్లు తెస్తాయి? అభ్యర్థుల ఎంపికలో ఏ వర్గానికి ప్రాధాన్యం లభిస్తుంది? అన్నది కీలకంగా మారనుంది.మున్సిపల్ ఎన్నికల్లో ఒక్కో వార్డు ఫలితం మొత్తం పాలకవర్గ ఏర్పాటుపై ప్రభావం చూపే అవకాశం ఉండటంతో పార్టీలు ఇప్పటి నుంచే తమ బలాబలాలను అంచనా వేసుకునే పనిలో పడే అవకాశం ఉంది.

ఓటర్లకు మాత్రం అభివృద్ధే ముఖ్యంరాజకీయ పార్టీలకు లెక్కలు వేరైనా.. విలీన గ్రామాల ప్రజలకు మాత్రం రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పన్నులు, మౌలిక సదుపాయాలే ప్రధాన అంశాలుగా మారనున్నాయి.“పంచాయతీ నుంచి మున్సిపాలిటీలోకి వస్తే తమ ప్రాంతానికి ఏం లాభం?” అన్నదే ప్రజల ముందున్న అసలు ప్రశ్న. మున్సిపాలిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత తమ ప్రాంతానికి నిధులు పెరుగుతాయా? అభివృద్ధి వేగవంతమవుతుందా? పన్నుల భారం ఎంత ఉంటుంది? వంటి అంశాలపై కూడా అభ్యర్థులను ప్రజలు నిలదీసే అవకాశం ఉంది.మొత్తంగా చూస్తే.. బాపట్ల మున్సిపల్ ఎన్నికలకు ఎన్నాళ్లుగానో అడ్డుగా ఉన్న విలీన పంచాయతీల న్యాయ వివాదం పరిష్కార దిశగా కదలడం కీలక పరిణామంగా మారింది. కోర్టు వ్యవహారాలు పూర్తిగా కొలిక్కి రావడం, వార్డుల పునర్విభజన జరగడం, రిజర్వేషన్లు ఖరారు కావడం, ఓటర్ల జాబితా సిద్ధం కావడం, రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించడం వంటి తదుపరి దశలపై ఎన్నికల నిర్వహణ ఆధారపడి ఉంటుంది.

అయితే రాజకీయంగా మాత్రం బాపట్ల మున్సిపల్ పోరుకు తెర లేచినట్లేనన్న చర్చ మొదలైంది. కొత్తగా చేరే గ్రామాలు.. పెరగనున్న వార్డులు.. మారనున్న ఓటర్ల లెక్కలు.. ఇప్పటికే ఉన్న రాజకీయ పోటీకి మరింత వేడి పుట్టించే అవకాశం కనిపిస్తోంది.

## నాణ్యమైన విద్యుత్ సరఫరాపై ప్రత్యేక దృష్టి



**బాపట్ల రక్షణ న్యూస్**

బాపట్ల జిల్లాలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడమే ప్రధాన లక్ష్యమని APCPDCL ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ పి. పుల్లారెడ్డి అన్నారు. బాపట్ల సర్కిల్ పనితీరుపై విజయవాడలోని కార్పొరేట్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు.విద్యుత్ సరఫరా నాణ్యత, ఫిర్యాదుల పరిష్కారం, రెవెన్యూ వసూళ్లు, లైన్ లాస్ తగ్గింపు, విద్యుత్ చౌర్యం నియంత్రణ, ఫీడర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, సబ్‌స్టేషన్ల పనితీరును సమీక్షించారు. తరచూ ట్రిప్పింగ్ అవుతున్న ఫీడర్లు, ఓవర్‌లోడ్ ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పీక్ డిమాండ్‌కు అనుగుణంగా లోడ్ బ్యాలెన్సింగ్, అవసరమైన సామర్థ్యాల పెంపు చేపట్టాలని సూచించారు.ూవీ సూర్య ఘర్, =ఋూా పథకాల పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని తెలిపారు. 1912 ద్వారా కొత్త విద్యుత్ సర్వీస్ కనెక్షన్లకు దరఖాస్తు చేసుకునే సౌకర్యంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని ఆదేశించారు. వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాల నివారణకు భద్రతా చర్యలు కట్టుదిట్టంగా అమలు చేయాలని, సిబ్బంది రక్షణ పరికరాలు వినియోగించాలని సూచించారు.రెవెన్యూ వసూళ్లు పెంచడంతో పాటు లైన్ లాస్, విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలని, వ్యవసాయ విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. వినియోగదారుల ఫిర్యాదులను వేగంగా, నాణ్యతతో పరిష్కరించి సంతృప్తి కలిగేలా సేవలు అందించాలని పుల్లారెడ్డి సూచించారు.సమావేశంలో పలువురు డైరెక్టర్లు, పల్నాడు సర్కిల్ ఎస్ఈ జి. ఆంజనేయులు, చీరాల, బాపట్ల ఈఈలు, ఏఈఈలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రఫీ, మష్రూమ్ కల్టివేషన్‌లో ఉచిత శిక్షణ

### గ్రామీణ నిరుద్యోగ యువతకు సదవకాశం



**గుంటూరు, (రక్షణ న్యూస్):** గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులు, మహిళలకు ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ, మష్రూమ్ కల్టివేషన్ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు యూనియన్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ సంచాలకులు టి. సందీప్ బాబు తెలిపారు. మష్రూమ్ కల్టివేషన్ శిక్షణ సెప్టెంబర్ 1 నుంచి, ఫోటోగ్రఫీ, వీడియోగ్రఫీ శిక్షణ సెప్టెంబర్ 16 నుంచి ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. 19 నుంచి 50 సంవత్సరాల వయస్సు కలిగిన ఆసక్తిగల అభ్యర్థులు గుంటూరు కొత్తపేట ఓల్డ్ బ్యాంక్ స్ట్రీట్‌లోని డోర్ నంబర్ 14-1-14లో ఉన్న శిక్షణ సంస్థలో తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. తెల్ల రేషన్‌కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, పదో తరగతి సర్టిఫికెట్ సమర్పించాలి. మరిన్ని వివరాలకు 0863-2336912, 9700687696, 8125397953, 9949930155, 9703405066 నంబర్లను సంప్రదించవచ్చు.

10- 5- 26 rakshana_praja jyothi Medhak.qxd 8/19/2026 6:25 AM Page 5



# హత్యకుట్రను పక్కదారి పట్టించే వీడియోనా?

మొదటి పేజీ తరువాయి

**గుంటూరు రక్షణ క్రైమ్ స్పెషల్**

గుంటూరు: బోనబోయిన శ్రీనివాస యాదవ్ హత్యకు రూ.కోటిన్నర సుపారీ ఆరోపణలు గుంటూరు రాజకీయాలను కుదిపేస్తున్న వేళ.. వైసీపీ నేత నరేంద్రరెడ్డికి సంబంధించినదిగా వైరల్ అవుతున్న సెల్ఫీ వీడియో ఇప్పుడు మరో చర్చకు తెరలేపింది. తనపై వచ్చిన హత్యకుట్ర ఆరోపణలకు నేరుగా సమాధానం ఇవ్వాల్సిన సమయంలో.. వీడియోలో ఇతర వ్యక్తుల పేర్లు, పాత వివాదాలు, అధికారుల ప్రస్తావనను ముందుకు తేవడం వెనుక ఉద్దేశం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అసలు హత్యకుట్ర ఆరోపణల నుంచి దృష్టి మళ్లించే వ్యూహంలో భాగంగానే ఈ వీడియోను రూపొందించారా? అన్న అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. అయితే వీడియో వెనుక అసలు ఉద్దేశం ఏమిటన్నది పోలీసు దర్యాప్తులోనే తేలాల్సి ఉంది. బోనబోయిన శ్రీనివాస యాదవ్‌ను హత్య చేసేందుకు భారీ మొత్తంలో సుపారీ మాట్లాడినట్లు నరేంద్రరెడ్డిపై ఆరోపణలు రావడం, ఆయన కదలికలపై రెక్కీ జరిగినట్లు సమాచారం బయటకు రావడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ సమయంలోనే నరేంద్రరెడ్డి సెల్ఫీ వీడియో బయటకు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. హత్యకుట్ర ఆరోపణలపై సమాధానం చెప్పడం కంటే.. తనపై దాడి జరిగినట్లు చూపించే అంశాలు, ఇతరులపై ఆరోపణలు చేయడం, పలు పేర్లను ప్రస్తావించడం ద్వారా అసలు వ్యవహారాన్ని మరో దిశకు మళ్లించే ప్రయత్నం జరిగిందా? అన్నదే ఇప్పుడు ప్రధాన చర్చ. వీడియోలో కేశవ్ పేరు ప్రస్తావనకు రావడం కూడా అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. బోనబోయిన హత్యకుట్ర ఆరోపణలకు కేశవ్‌కు సంబంధం ఏమిటి? ఈ వ్యవహారంలో ఆయన పాత్రపై ఏమైనా ఆధారాలు ఉన్నాయా? లేక అసలు కేసుతో సంబంధం లేని వ్యక్తి పేరును తెరపైకి తీసుకురావడం ద్వారా చర్చను మరో అంశం వైపు మళ్లించే ప్రయత్నమా? అన్నది పోలీసులు తేల్చాల్సి ఉంది. ఒక వ్యక్తి పేరు వీడియోలో ప్రస్తావనకు వచ్చినంత మాత్రాన అతనిపై ఆరోపణలు నిజమని భావించలేం. అందుకే కేశవ్ పేరు ఎందుకు వచ్చింది? ఎవరి సూచనతో వచ్చింది? దాని వెనుక ఏమైనా రాజకీయ నేపథ్యం ఉందా? అన్నదానిపై స్వతంత్ర విచారణ అవసరమన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇదే తరహాలో ఐఏఎస్ అధికారి పులి శ్రీనివాస్ పేరును ఈ వివాదంలోకి తీసుకురావడంపైనా ప్రశ్నలు తలెత్తుతున్నాయి. అనుమతులు లేని భవనాన్ని అధికారులు నిబంధనల ప్రకారం తొలగించారన్న అంశం ఉంటే.. ఆ వ్యవహారానికి ఇప్పుడు ఒక ఐఏఎస్ అధికారిని ఎందుకు అనుసంధానిస్తున్నారు? పాత భవనం తొలగింపునకు, ప్రస్తుతం అదే ప్రాంతంలో వచ్చిన నిర్మాణానికి మధ్య ఉన్న అనుమతుల వ్యవహారం ఏమిటి? దీనిపై అధికారిక రికార్డులు ఏమి చెబుతున్నాయి? అన్నదే ప్రశ్న కావాలి. కానీ దానికి బదులుగా అధికారుల పేర్లను రాజకీయ వివాదంలోకి తీసుకురావడం వెనుక ఉద్దేశం ఏమిటన్నది కూడా పోలీసుల దృష్టికి వెళ్లాల్సిన అంశమే. హత్యకుట్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న సమయంలోనే ఒకవైపు తనపై దాడి జరిగినట్లు చూపించే వీడియోలను వైరల్ చేయడం, మరోవైపు తనపై గతంలో వచ్చిన ఆరోపణలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు లేదా ఇతర ఆధారాలను ప్రస్తావించకుండా ఉండటం కూడా చర్చనీయాంశమవుతోంది. ప్రత్యర్థి వర్గాలు మాత్రం.. ఒకవైపు తనపై జరిగినట్లు చెబుతున్న దాడిని మాత్రమే చూపిస్తూ, తనపై గతంలో వచ్చిన ఆరోపణలు, వివాదాలకు సంబంధించిన దృశ్యాలను దాచిపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తున్నాయి. అయితే ఏ వీడియో నిజమో, ఏది ఎడిట్ చేయబడిందో, ఏ ఘటనకు సంబంధించినదో పోలీసులు సాంకేతికంగా నిర్ధారించాల్సి ఉంది. ముఖ్యంగా దీపావళి సమయంలో చోటుచేసుకున్నట్లు చెబుతున్న పాత ఘటనను కూడా ఇప్పుడు ప్రత్యర్థి వర్గాలు ప్రస్తావిస్తున్నాయి. చిన్న టపాసు ఘటనను కారణంగా చేసుకుని కొందరిని సమీకరించి గొడవకు దిగారని, ఓ మహిళతో పాటు కొందరిపై దాడి జరిగిందని, ఇంటి వద్దకు వెళ్లి తలుపులు ధ్వంసం చేసినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయని చెబుతున్నారు. ఆ ఘటనలో నరేంద్రరెడ్డి పాత్ర ఎంత? కేసు నమోదైందా? ఎవరిపై చర్యలు తీసుకున్నారు? అన్నది అధికారిక రికార్డులతోనే తేలాలి. తాజా హత్యకుట్ర ఆరోపణల నేపథ్యంలో ఆ పాత ఘటనను కూడా పోలీసులు పరిశీలించాలన్న డిమాండ్ వినిపిస్తోంది. బోనబోయిన శ్రీనివాస యాదవ్, నరేంద్రరెడ్డి మధ్య గతంలోనే విభేదాలు ఉన్నాయని ఇరువర్గాల నుంచి ఆరోపణలు ఉన్నాయి. బార్ వద్ద జరిగిన పాత ఘర్షణ, శ్రీనివాస యాదవ్ కుమారుడిపై జరిగినట్లు చెబుతున్న దాడి వంటి ఘటనలు కూడా ఇప్పుడు మళ్లీ చర్చలోకి వచ్చాయి. బోనబోయిన స్థానికంగా నరేంద్రరెడ్డి వ్యవహారాలను ప్రశ్నించడం వల్లే విభేదాలు పెరిగాయని ఆయన వర్గీయులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యం తాజా హత్యకుట్ర ఆరోపణలకు దారితీసిందా? లేక రాజకీయంగా ఇరువర్గాలు పరస్పరం ఆరోపణలు చేసుకుంటున్నాయా? అన్నది దర్యాప్తులో తేలాల్సి ఉంది. మరోవైపు హత్యకుట్ర ఆరోపణలు వెలుగులోకి వచ్చిన తర్వాత నరేంద్రరెడ్డి అందుబాటులో లేకపోవడం కూడా రాజకీయంగా చర్చనీయాంశమైంది. అయితే ఎవరైనా అందుబాటులో లేకపోవడం ఒక్కటే నేరానికి ఆధారం కాదు. పోలీసులు ఆయనను విచారించి సుపారీ వ్యవహారం, రౌడీషీటర్‌తో సంబంధాలు, రెక్కీ నిర్వహించిన వ్యక్తులు, ఫోన్ సంభాషణలు, ఆర్థిక లావాదేవీలపై ఆధారాలు సేకరించాల్సి ఉంది. ఈ మొత్తం వ్యవహారం కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి వెళ్లినట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ వ్యవహారాన్ని సీరియస్‌గా తీసుకున్నట్లు, సమగ్ర దర్యాప్తు ద్వారా వాస్తవాలను బయటకు తేవాలని పోలీసు యంత్రాంగానికి సూచనలు అందినట్లు సమాచారం. దీనిపై అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. హత్యకుట్ర ఆరోపణలు ఒకవైపు.. నరేంద్రరెడ్డి సెల్ఫీ వీడియో మరోవైపు.. కేశవ్ పేరు ఎందుకు? ఐఏఎస్ పులి శ్రీనివాస్ పేరును ఎందుకు తెచ్చారు? తనపై దాడి జరిగిన దృశ్యాలను మాత్రమే వైరల్ చేయడం వెనుక ఉద్దేశం ఏమిటి? గత ఘటనలకు సంబంధించిన అంశాలను ఎందుకు ప్రస్తావించడం లేదు? ఈ మొత్తం వీడియోను ఎవరు రూపొందించారు? ఎవరి సూచనలతో విడుదలైంది? దీని వెనుక రాజకీయ హస్తం ఉందా? అన్న ప్రశ్నలకు సమాధానాలు పోలీసు విచారణలోనే రావాల్సి ఉంది. హత్యకుట్ర ఆరోపణలను పక్కదారి పట్టించేందుకు వీడియోను ఉపయోగించారా? లేక నరేంద్రరెడ్డి తనపై వచ్చిన ఆరోపణలకు రాజకీయంగా సమాధానం చెప్పేందుకు మాత్రమే వీడియో చేశారా? అన్నది కూడా తేలాల్సిన అంశమే. వైరల్ వీడియోతో కథ మారుతుందా?.. లేక దర్యాప్తు ముందుకు సాగితే అసలు కథే బయటపడుతుందా? అన్నదే ఇప్పుడు గుంటూరు రాజకీయాల్లో హాట్‌టాపిక్‌గా మారింది.

# పీహెచ్‌సీల్లో మెరుగైన వైద్యం అందించాలి

## పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు: కలెక్టర్




**గుంటూరు, (రక్షణ న్యూస్):** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి ఆదర్శంగా నిలవాలని జిల్లా కలెక్టర్ సి.యం. సాయికాంత్ వర్మ వైద్యాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో పీహెచ్‌సీ వైద్యాధికారులతో నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో వైద్య రంగానికి అవసరమైన వసతులు ఉన్నాయని, వాటిని సమర్థంగా వినియోగించుకుని మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో పరిశుభ్రమైన వాతావరణం ఉండాలని, వైద్యం కోసం వచ్చే ప్రజలతో ప్రేమ, ఆప్యాయతలతో మాట్లాడాలని అన్నారు. వృత్తి ధర్మాన్ని నిబద్ధతతో నిర్వర్తించాలని సూచించారు. ప్రభుత్వం, వైద్య ఆరోగ్య శాఖ నిర్దేశించిన పనితీరు సూచికలను 100 శాతం సాధించాలని ఆదేశించారు. ప్రతి పీహెచ్‌సీ 'ఏ' గ్రేడ్ సాధించేలా పనిచేయాలని, పనితీరు మెరుగుపరచుకోని వైద్యాధికారులపై కఠిన చర్యలు తీసుకోవడానికి వెనుకాడేది లేదని హెచ్చరించారు. నిరంతర సమీక్షల ద్వారా పనితీరును పర్యవేక్షిస్తామని తెలిపారు. సమావేశంలో డీఎంహెచ్‌ఓ కె. విజయలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి బి.వి. నాగసాయి కుమార్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

## గ్రానైట్ గని విస్తరణపై ప్రజాభిప్రాయ సేకరణ

**ప్రజల అభిప్రాయాలు, అభ్యంతరాల నమోదు**



**పల్నాడు, (రక్షణ న్యూస్):** చిలకలూరిపేట మండలం ఎడవల్లి గ్రామ పరిధిలోని సర్వే నంబర్లు 381/2, 381/3-1లో 1.450 హెక్టార్ల విస్తీర్ణంలో ఉన్న వీరశివ గ్రానైట్స్ అండ్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ బ్లాక్ గ్రానైట్ గని విస్తరణ ప్రతిపాదనపై మంగళవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా, ఆర్డీఓ బాలకృష్ణ ఆధ్వర్యంలో ఏపీపీసీబీ పర్యవేక్షణలో కార్యక్రమం జరిగింది. ప్రస్తుతం గని ద్వారా ఏడాదికి 600 క్యూబిక్ మీటర్ల బ్లాక్ గ్రానైట్ ఉత్పత్తి జరుగుతుండగా, విస్తరణ ఉత్పత్తి సామర్థ్యాన్ని 10,006 క్యూబిక్ మీటర్లకు పెంచాలని ప్రతిపాదించారు. ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.20 లక్షలుగా పేర్కొన్నారు. పరిసర గ్రామాల ప్రజలు, స్థానికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని గని విస్తరణపై తమ అభిప్రాయాలు, సూచనలు, అభ్యంతరాలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రజలు స్వేచ్ఛగా తమ అభిప్రాయాలను వెల్లడించేందుకు అధికారులు అవకాశం కల్పించగా, వాటిని అధికారికంగా నమోదు చేశారు. ప్రజల భాగస్వామ్యంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రజాభిప్రాయ సేకరణ ముగిసింది.

## ప్రమాద రహిత పల్నాడే లక్ష్యం

**బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక దృష్టి: ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు**



**పల్నాడు, (రక్షణ న్యూస్):** పల్నాడు జిల్లాను రహదారి ప్రమాద రహిత జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా అవసరమైన ముందస్తు చర్యలు, సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశాన్ని కలెక్టర్ కృతిక శుక్లా అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ప్రమాదాలు జరిగే ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్ కృతిక శుక్లా మాట్లాడుతూ జిల్లాలో గుర్తించిన బ్లాక్ స్పాట్లపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, రహదారి భద్రతపై పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు, వాహనదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. అవసరమైన ప్రాంతాల్లో అవగాహన పాంప్లెట్లు పంపిణీ చేయాలని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో 34 బ్లాక్ స్పాట్లను గుర్తించామని, వాటిలో 16 జాతీయ రహదారులపై ఉన్నాయని అధికారులు వివరించారు. ప్రమాదాలు పునరావృతం కాకుండా బ్లాక్ స్పాట్ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. లైసెన్సులు లేని వాహనదారులపై చర్యలు, అధిక బరువుతో వెళ్లే వాహనాలపై జరిమానాలు, దమ్ము చక్రాలతో రోడ్లపైకి వచ్చే వాహనాలపై పెనాల్టీలు విధించాలని సమావేశంలో చర్చించారు. సమావేశంలో అదనపు ఎస్పీ రోహిత్ కుమార్, రవాణా శాఖ జిల్లా అధికారి సంజీవ్ కుమార్, ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్ఏఐ, వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, ఎంవీఐలు పాల్గొన్నారు.

## తాగునీటి పనులు వేగవంతం చేయాలి

**1.78 లక్షల ఇళ్లకు కుళాయి కనెక్షన్లు: ఎంపీ లావు**

**నరసరావుపేట, (రక్షణ న్యూస్):** జిల్లాలో తాగునీటి ఎద్దడిని నివారించడంతో పాటు జలజీవన్ మిషన్, పల్నాడు వాటర్ గ్రిడ్ పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కృతిక శుక్లాతో కలిసి జలజీవన్ మిషన్‌పై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీరాజ్, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మిగిలిన సుమారు 1.78 లక్షల గ్రామీణ గృహాలకు కుళాయి కనెక్షన్లు అందించే పనులను వేగవంతం చేయాలని సూచించారు. 28 మండలాల్లోని 794 ఆవాసాల్లో ఫేజ్–2 కింద 368 ఆవాసాల్లో కుళాయి కనెక్షన్లు కల్పించినట్లు అధికారులు వివరించారు. జేజేఎం–ఐఎంఐఎస్ పోర్టల్‌లో నిధుల వ్యయానికి సంబంధించిన ఆన్‌లైన్ ఎంట్రీలను సకాలంలో పూర్తి చేయాలని, టెండర్లలో జాప్యం ఉండకూడదని ఎంపీ ఆదేశించారు. నాగార్జునసాగర్ నుంచి గ్రామాలకు నీటిని అందించే శాశ్వత వనరులు, డెడికేటెడ్ ఇంటెక్ వెల్స్, పంపింగ్ వ్యవస్థల పనులను వేగవంతం చేయాలని సూచించారు. జిల్లాలో జలజీవన్ మిషన్ కింద 1,764 పనులు మంజూరుకాగా, 1,159 పనులు రద్దయ్యాయని, 605 పనులు మిగిలాయని అధికారులు తెలిపారు. వీటిలో 187 పనులు పూర్తయ్యాయని, 231 పనులు పురోగతిలో ఉన్నాయని వివరించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, అటవీ శాఖ అధికారి డి.వి. రమణ,

# సూర్యఘర్ పథకానికి వేగం పెంచాలి

## పల్నాడు వెనుకబాటు.. విద్యుత్ అధికారులకు ఎంపీ ఆదేశం



**నరసరావుపేట, (రక్షణ న్యూస్):** ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం కింద ఇళ్లపై సోలార్ ప్యానెళ్ల ఏర్పాటులో పల్నాడు జిల్లా వెనుకబడి ఉందని, పనులను వేగవంతం చేయాలని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్ కృతిక శుక్లాతో కలిసి జిల్లా విద్యుత్ కమిటీ సమావేశంలో ఆయన సమీక్ష నిర్వహించారు. అటవీ ప్రాంతాల్లో విద్యుత్ పనులు చేపట్టేటప్పుడు అటవీ శాఖ అధికారులతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. బొల్లాపల్లి మండలంలో విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ విద్యుత్ శాఖ ఎస్ఈని ఆదేశించారు. మాచర్ల, దుర్గి, వెల్దుర్తి, పిడుగురాళ్ల మండలాల్లో 11 కేవీ వ్యవసాయ ఫీడర్ల ఏర్పాటు పూర్తయినట్లు అధికారులు తెలిపారు. 33 కేవీ ఫీడర్లకు సంబంధించి 11 ప్రాజెక్టులకు డీపీఆర్‌లు సమర్పించగా, 11కు అనుమతులు లభించాయని, మూడు పనులు పూర్తయ్యాయని, ఏడు పనులు పురోగతిలో ఉన్నాయని, మరో పని టెండర్ దశలో ఉందని వివరించారు. సూర్యఘర్ పథకం కింద జిల్లాలో 32,929 మంది వినియోగదారులు నమోదు కాగా, 25,839 మందికి అనుమతులు మంజూరయ్యాయని, 12,473 ఇళ్లలో సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన పనులను వేగంగా పూర్తి చేయాలని ఎంపీ ఆదేశించారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, జిల్లా అటవీ శాఖ అధికారి డి.వి. రమణ, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

# రౌడీషీటర్లపై నిరంతర నిఘా కొనసాగించాలి

## ఎస్పీ ఉమామహేశ్వర్..



**బాపట్ల రక్షణ న్యూస్**

జిల్లాలో పాత నేరస్థులు, రౌడీషీటర్లు తిరిగి నేరాలకు పాల్పడకుండా నిరంతరం నిఘా ఉంచి, సత్ప్రవర్తనతో మెలిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ బి. ఉమామహేశ్వర్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. నేర నియంత్రణకు బేసిక్ పోలీసింగ్‌ను సమర్థవంతంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. మంగళవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం నుంచి జిల్లాలోని పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పాత నేరస్థులు, రౌడీషీటర్లు, చెడు నడత కలిగిన వ్యక్తులు, గంజాయి కేసుల నిందితుల ప్రస్తుత పరిస్థితిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పాత నేరస్థుల జీవనోపాధి, ప్రస్తుత ప్రవర్తన, కదలికలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తూ ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. నేరాలకు పాల్పడే అవకాశం ఉన్న వారిని ముందుగానే గుర్తించి ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘించి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, పదేపదే హెచ్చరికలను ఉల్లంఘించే వారిపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని ఆదేశించారు. నేర రహిత సమాజ నిర్మాణంలో బేసిక్ పోలీసింగ్ కీలకమని ఎస్పీ పేర్కొన్నారు. ఫుట్ పెట్రోలింగ్, విజిబుల్ పోలీసింగ్, గ్రామ సందర్శనలు, పల్లెనిద్ర కార్యక్రమాల ద్వారా ప్రజల నుంచి ముందస్తు సమాచారాన్ని సేకరించి నేరాలను అరికట్టాలన్నారు. హాట్‌స్పాట్, సున్నిత ప్రాంతాల్లో పెట్రోలింగ్ పెంచాలని, జైలు నుంచి విడుదలైన నిందితుల కదలికలపై నిఘా కొనసాగించాలని సూచించారు .గంజాయి రవాణా, విక్రయాలు, మహిళలపై నేరాల విషయంలో 'జీరో టాలరెన్స్' విధానం అమలు చేయాలని ఎస్పీ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వలస కార్మికుల ద్వారా గంజాయి సరఫరా జరిగే అవకాశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని నేరాలను ముందుగానే గుర్తించి అరికట్టాలని సూచించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యాన్ని సహించబోమని, తమ పరిధిలోని పాత నేరస్థులు తిరిగి నేరాలకు పాల్పడితే సంబంధిత పోలీసు అధికారులపై శాఖాపరమైన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఎల్. సుధాకర్, చీరాల, రేపల్లె డీఎస్పీలు ఎం.డి. మొయిన్, షేక్ అబ్దుల్ అజీజ్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.